క్లుప్తంగా

12, 13న రోల్‌ప్లే, ఫోక్ డ్యాన్స్ పోటీలు

ఇందుకూరుపేట : మండలంలోని పల్లిపాడు డైట్ కళాశాలలో ఈనెల 12, 13వ తేదీన జిల్లా స్థాయి రోల్‌ప్లే, ఫోక్ డ్యాన్స్ పోటీలను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పి.రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని కేంద్ర, రాష్ట్ర, ఎయిడెడ్, ప్రైవేట్, కేజీబీవీ, ఏపీ మోడల్ పాఠశాలల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలకు అర్హులని చెప్పారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తామని ఆయన వివరించారు. పూర్తి వివరాల కోసం కళాశాల అధ్యాపకుడు బొయదాస్- సెల్ నంబర్ 77020 01656ను సంప్రదించాలని ప్రిన్సిపల్ కోరారు.

శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు సీతాదేవి 19వ శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆ మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా, సోమిశెట్టి వెంకటరత్నం తెలిపారు. సీతారామస్వామి మందిరంలో సోమవారం శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారామస్వామి మందిర కమిటీ, వాకాటి నరసయ్య త్యాగరాజ కల్యాణ మండపం కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో అష్టలక్ష్మి వైభవం, లక్ష్మీహోమం, శ్రీలలితా సహస్రనామార్చన, శ్రీదేవి ఖడ్గమాల, సామూహిక కుంకుమార్చన నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతిరోజూ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అభిషేకం, అలంకారం, అర్చన, హోమం, సాయంత్రం 6 నుంచి రాత్రి 8గంటల వరకు కలశ పూజ, అవతారదేవి పూజ, విశేష హోమాలు, పూజలు నిర్వహించనున్నట్లు వివరించారు.
శరన్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారు ప్రతి రోజూ విశేషాలంకారాల్లో కొలువై భక్తులను కటాక్షిస్తారని తెలిపారు. మందిర కమిటీ కోశాధికారి తన్నీరు మస్తాన్‌రావు, ప్రధానార్చకుడు బీ శ్రీనివాసదీక్షితులు, కల్యాణ మండప కమిటీ కార్యదర్శి అమరామోహన్‌రావు, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

నృసింహుని సేవలో స్టేట్ లీగల్ సర్వీసెస్ సెక్రటరీ



నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన నరసింహకొండపై ఉన్న శ్రీవేదగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని స్టేట్ లీగల్ సర్వీసెస్ సెక్రటరీ బబిత కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. ఆలయంలోని శ్రీవారి, ఆదిలక్ష్మి అమ్మవారి సన్నిధిల వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ విశిష్టతను అర్చకులు వివరించారు. తొలుత దేవాదాయశాఖ అధికారులు, ఆలయ అర్చకులు ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆమె వెంట జిల్లా సీనియర్ సివిల్ జడ్జి వాణి ఉన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని కిసాన్ నగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని నాల్గోమైలు ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో గుర్తుతెలియని వాహనం విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో విద్యుత్ స్తంభం రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. ఆ సమయంలో రోడ్డుపై వాహనాలు వెళ్లకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ ఏఈ విజయ్ కుమార్ వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేసి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. సాయంత్రం 5 గంటల సమయానికల్లా సిబ్బంది పడిపోయిన విద్యుత్ స్తంభం స్థానంలో కొత్తది ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

శౌర్య జాగరణ రథయాత్ర

ఉదయగిరి: విశ్వహిందూ పరిషత్ భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఉదయగిరిలో శౌర్య జాగరణ రథయాత్ర నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి యనమల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వీఎస్పీ స్థాపించి ఆరు దశాబ్దాలు గడిచిందన్నారు. వచ్చే ఏడాది జనవరిలో అయోధ్యలో జరిగే విగ్రహ ప్రతిష్టపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైద్య శిబిరం ప్రారంభం

అనుమసముద్రంపేట: హజరత్ నాయబ్ రసూల్ దర్గా గంధమహోత్సవం సందర్భంగా దర్గా ప్రాంగణంలో సోమవారం వైద్య శిబిరాన్ని వక్ఫ్‌బోర్డు అధికారి హుస్సేన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దర్గాకు గంధమహోత్సవం సందర్భంగా సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారని, అత్యవసర సమయంలో వారికి వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఏఎస్‌పేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దర్గాకు వచ్చిన భక్తులు దర్గా ప్రాంగణంలోని వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జిలానీ, వైద్య సిబ్బంది ఫణీంద్రరెడ్డి, యు శ్రీనివాసులు, రసూల్, ఏఎన్‌ఎంలు, ఆశ వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం

• రోగులకు మందుల పంపిణీ

ఇందుకూరుపేట : పేదలకు సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని ఎంపీడీఓ కే నాగేంద్ర బాబు అన్నారు. మండలంలోని లేబూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటి వద్దకే వచ్చి వైద్యసేవలను అందజేస్తోందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు. అనంతరం శిబిరానికి వచ్చిన గ్రామస్తులకు స్పెషలిస్ట్ డాక్టర్లు వైద్యసేవలు అందించి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు వంటి వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వసుంధర, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబయ్య, సదాశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట : జగనన్న సురక్ష శిబిరంలో వైద్యులు, ప్రజాప్రతినిధులు

ఆర్‌వైపాళెంలో..

పొదలకూరు : మండలంలోని ఆర్‌వైపాళెం సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను సోమవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన వారికి వివిధ రకాల పరీక్షలు జరిపారు. కో-లోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిరణ్‌రిషిత పర్యవేక్షణలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. హెల్ప్‌డెస్క్ ద్వారా క్యాంపునకు వచ్చిన రోగులను వలంటీర్లు, సిబ్బంది వైద్యనిపుణుల వద్దకు తీసుకువెళ్లారు. సర్వేలో అందజేసిన టోకెన్ల ద్వారా వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. చిన్నపిల్లల వైద్యనిపుణుడు డాక్టర్ మల్లికార్జున్ రోగులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరంలో సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు బూసుపల్లి చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

వెంకటాచలం : మండల కేంద్రమైన వెంకటాచలం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా శిబిరానికి వచ్చిన రోగులకు స్పెషలిస్ట్ వైద్యులు పరీక్షలు చేసి, అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కసుమూరు పీహెచ్‌సీ వైద్యురాలు పవిత్ర, ప్రవళిక, సిబ్బంది పాల్గొన్నారు.

మంచి ఆరోగ్యమే లక్ష్యం

కోవూరు : ప్రజలకు మంచి ఆరోగ్యం అందించడమే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని జెడ్పీటీసీ సభ్యురాలు కవరగిరి శ్రీలత అన్నారు. మండలంలోని లేగుంటపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోనే ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నట్లు చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుమ్మలపెంట పార్వతి, ఎంపీడీఓ శ్రీహరి, తహసీల్దార్ పద్మజ, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గుణపాటి ప్రసాద్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు

పేదల పాలిట వరం

విడవలూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల పాలిట వరంగా మారిందని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని రామచంద్రాపురం సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచిత వైద్యసేవలు అందించడంతో పాటు మందులు, పోషకాహారాలను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ బుచ్చింగారి తిరుపతయ్య, సర్పంచ్ కార్పింగారి శీనయ్య, ఎంపీడీసీ సభ్యులు అవుల వాసు, వావిళ్ల రవి, డాక్టర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా, అంగన్‌వాడి వర్కర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు : వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు



విడవలూరు : రామచంద్రాపురం సచివాలయంలో..



వెంకటాచలం : సురక్ష శిబిరంలో రోగులకు వైద్యసేవలు



కోవూరు : చిన్నారికి కంటి అద్దాలు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత



పొదలకూరు : ఆరోగ్య సురక్ష శిబిరానికి హాజరైన గ్రామస్తులు

నేడు సర్వేపల్లిలో మంత్రి కాకాణి పర్యటన

వెంకటాచలం : మండలంలోని సర్వేపల్లి గ్రామంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం పర్యటిస్తారని మండల వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి సోమవారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు గ్రామానికి చేరుకుని జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలిస్తారని, అనంతరం జగనన్న కాలనీలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తారన్నారు. గ్రామంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని తెలియజేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పొదలకూరు : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తామని ఎంపీడీఓ టీ.నగేష్‌కుమారి సోమవారం తెలిపారు. ఎంపీపీ కె.సుబ్బరాయుడు అధ్యక్షతన జరుగనున్న సమావేశంలో రానున్న వర్షాకాలంలో గ్రామాల్లో వ్యాధి నిరోధక చర్యలపై సమీక్ష, మండల అభివృద్ధిపై చర్చ, జగనన్న ఆరోగ్య సురక్షపై సమీక్షిస్తామన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యురాలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు హాజరు కావాల్సిందిగా సూచించారు.

నేడు బ్రహ్మదేవిలో సురక్ష శిబిరం

ముత్తుకూరు : మండలంలోని బ్రహ్మదేవి-2 సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం కార్యక్రమం మంగళవారం జరుగుతుందని మండల పరిషత్ సూపరింటెండెంట్ లక్ష్మణరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొని, వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు

పొదలకూరు : మేజర్ పంచాయతీ పొదలకూరు ఒకటో వార్డులో రెండోరోజు సోమవారం కూడా పారిశుద్ధ్య పనులు కొనసాగించారు. మురుగు కాలువల్లో పేరుకున్న పూడికను తొలగించారు. స్పెషల్ డ్రైవ్ కింద పంచాయతీ నిర్వాహకులు పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. దోమల ఉధృతిని తగ్గించేందుకు ఫాగింగ్ చేయిస్తామని సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, వార్డుసభ్యుడు ఎస్‌కే అంజాద్ తదితరులు పాల్గొన్నారు.



కాలువలో పూడికను తొలగిస్తున్న సిబ్బంది

జిల్లాస్థాయిలో పల్లిపాడు విద్యార్థుల ప్రతిభ



ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

• రాష్ట్రస్థాయికి ఎంపిక

ఇందుకూరుపేట : ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాల్‌బ్యాడ్మింటన్ పోటీల ఎంపికలు సోమవారం జరిగాయి. ఇందులో ఇందుకూరుపేట మండలం పల్లిపాడు పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్-14, అండర్-17 విభాగాల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వారిలో అండర్-14 బాలికల విభాగంలో ఎస్.శ్రావ్య, ఎం.పల్లవి, పి.చైత్ర, అండర్-17 బాలికల విభాగంలో వి.హాసిని అండర్-14 బాలుర విభాగంలో ఎస్.సాయి చరణ్‌తేజ్, ఎల్.సుశాంత్ సాయి, ఎస్.శ్రీనివాసులు ఎంపికయ్యారు.
దీంతో వీరిని హెచ్‌ఎం డి.జ్ఞానప్రసూన, ఫిజికల్ డైరెక్టర్ పి.లక్ష్మయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

విజయవాడ సభకు తరలిన నేతలు

ముత్తుకూరు : విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సోమవారం జరిగిన వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సభకు ముత్తుకూరు మండలం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, అభిమానులు తరలివెళ్లారు. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధనరెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటరమణయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నెల్లూరు శివప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు పోలిరెడ్డి చిన్నపరెడ్డి, ట్రేడ్ యూనియన్ కన్వీనర్ గండవరం సూరి, తదితరులు ప్రతినిధుల సభలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొని, ప్రసంగించిన ఈ సభలో 'వై నాట్ 175' ప్లకార్డులు ప్రదర్శించారు.



ప్రతినిధుల సభలో ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు

ఆటోను ఢీకొన్న బైక్ : ఇద్దరికి తీవ్రగాయాలు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు సమీపంలో అల్లంపాడు క్రాస్ రోడ్డు వద్ద 67వ నంబరు జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న బైక్ ఎదురుగా ఆటోను ఢీకొన్న ఘటన సోమవారం రాత్రి జరిగింది. బైక్‌లో ప్రయాణిస్తున్న ముగ్గురిలో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరు మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు తెలిపారు. అనంతసాగరం మండలం అగ్రహారానికి చెందిన అంకయ్య, సుబ్రహ్మణ్యంలకు కుడి వైపు కాలు విరిగాయని స్థానికులు తెలిపారు. 108 వాహనానికి ఫోన్ చేయడంతో ఈఎంటీ షేక్ షిక్బతుల్లా, పైలట్ ఎస్.శ్రీనివాసులు క్షతగాత్రులను హుటాహుటిన ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్య చికిత్స కోసం వారిని నెల్లూరుకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



క్షతగాత్రులు అంకయ్య, సుబ్రహ్మణ్యం

జగనన్నకు చెబుదాంలో వినతుల స్వీకరణ

పొదలకూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సోమవారం వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారు వినతిపత్రాలను సమర్పించారు. భూ వివాదాలు, కొలతలు, పాసు పుస్తకాలకు సంబంధించిన సమస్యలపై అర్జీలను తహసీల్దార్ కె.వీరవసంతరావుకు అందజేశారు. వాటిని పరిశీలించిన ఆయన విచారణ జరిపి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సాయిగణేష్‌బాబు పాల్గొన్నారు.

రేపు కలెక్టర్ ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాం

మనుబోలు : ఈనెల 11వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో జిల్లా కలెక్టర్ హరినారాయణన్‌తో పాటు పలువురు జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని వివరించారు. ప్రజలు తమ సమస్యలను సంబంధిత అధికారి దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తారని తెలిపారు.

12న జాతీయ లైవ్‌స్టాక్ మిషన్‌పై అవగాహన

నెల్లూరు(సెంట్రల్): నగరంలోని పురమందిరంలో ఈ నెల 12న జిల్లాలోని రైతులకు జాతీయ లైవ్‌స్టాక్ మిషన్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పౌల్ట్రీ సహా పశువుల విభాగంలో సుస్థిరాభివృద్ధి, పెరుగుదల సాధించడానికి కేంద్ర ప్రభుత్వం నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్‌ను అమలు చేస్తోందని చెప్పారు. అందులో భాగంగా జీవాలు, కోళ్లు, పందులు, పశువుల పెంపకంపై జిల్లా రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. రైతులు, ఔత్సాహిక నిరుద్యోగులు హాజరుకావాలని కోరారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): తల్పగిరికాలనీలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ తన సిబ్బందితో కలిసి ఆదివారం రాత్రి దాడి చేశారు. ఈ దాడుల్లో ఐదుగురు జూదరులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.13 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఇరిగేషన్ ఇన్‌చార్జి డీఈఈగా చంద్రమౌళి

ఉదయగిరి: జలవనరులశాఖ ఉదయగిరి ఇన్‌చార్జి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా కందుకూరి చంద్రమౌళిని నియమిస్తూ సోమవారం ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ప్రస్తుతం మండలంలోని గండిపాళెం జలాశయం ఏఈగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులు డీఈఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

వైద్య సేవలందేలా చూడాలి

• ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

కొడవలూరు : అనారోగ్యంతో ఉన్న ప్రతి ఒక్కరికీ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ద్వారా ఉచిత వైద్య సేవలందేలా వలంటీర్‌లు చూడాలని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెం-1 సచివాలయంలో వలంటీర్‌లతో సోమవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష శిబిరంలో ఎంతటి అనారోగ్య సమస్యలకైనా వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. దీనివల్ల ప్రజలకు ముందస్తు సమాచారం అందించి వారు శిబిరానికి వచ్చేలా వలంటీర్‌లు కృషి చేయాలన్నారు. శిబిరంలో వైద్య పరీక్షల అనంతరం వృద్ధులు, వైకల్యం కలిగిన వారిని ఇంటికి చేర్చే బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తున్నందున ప్రజలంతా వైద్య సేవలు సద్వినియోగం చేసుకునేలా వలంటీర్‌లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి జి.జాలయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళపై దాడి

• కేసు నమోదు

వెంకటాచలం : మండలంలోని కసుమూరు గ్రామానికి చెందిన రాపూరు అంకమ్మను అదే గ్రామానికి చెందిన రమణమ్మ, పోలయ్య, పుట్టయ్య దాడి చేయడంపై వెంకటాచలం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. కసుమూరు గ్రామానికి చెందిన ఎస్.రజితను ఆమె అత్త, మామలైన రమణమ్మ, పోలయ్య, మరిది పుట్టయ్య అదనపు కట్నం తీసుకురావాలని ఆదివారం రాత్రి గొడవకు దిగారు. ఈ విషయాన్ని అదే గ్రామానికి చెందిన తన అక్క రాపూరు అంకమ్మకు ఫోన్ ద్వారా రజిత తెలియజేసింది. వెంటనే రజిత ఇంటికి అంకమ్మ చేరుకుని తన చెల్లెలితో ఎందుకు గొడవ పడుతున్నారని ప్రశ్నించడంతో రమణమ్మ, పోలయ్య, పుట్టయ్య ముగ్గురూ కలిసి అంకమ్మపై దాడి చేశారు. దీంతో బాధితురాలు వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తహసీల్దార్‌కు ఎండీయూ ఆపరేటర్ల వినతి

మనుబోలు : గత కొంతకాలంగా సర్వర్ పనిచేయకపోడంతో రేషన్ బియ్యం పంపిణీని ఆపేస్తున్నట్లు ఎండీయూ ఆపరేటర్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ శివకృష్ణయ్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వర్ 7.9.1 వెర్షన్ ప్రవేశపెట్టినప్పటి నుంచి సక్రమంగా పనిచేయడం లేదన్నారు. దీంతో రేషన్ బియ్యం పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతూ ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. దీనిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సింహపురి సాహిత్య భీష్ముడు అగస్త్యరెడ్డి



అగస్త్యరెడ్డి వెంకురెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పుర ప్రముఖులు

నెల్లూరు(బృందావనం): సింహపురికి సాహిత్యపరంగా ఎనలేని సేవలందించిన ప్రముఖ కవి, విమర్శకుడు, సమాజసేవకుడు, అడ్వొకేట్ అగస్త్యరెడ్డి వెంకురెడ్డి సింహపురి సాహిత్య భీష్ముడని పలువురు వక్తలు శ్లాఘించారు. పురమందిరంలో రావు బహద్దూర్ రేబాల లక్ష్మీనరసారెడ్డి టౌన్ హాల్ ట్రస్ట్ బోర్డు, శ్రీనెల్లూరు వర్ధమాన సమాజం, దువ్వూరి రామిరెడ్డి విజ్ఞాన సమితి ట్రస్ట్, నెల్లూరు సంయుక్త ఆధ్వర్యంలో అగస్త్యరెడ్డి వెంకురెడ్డి సంస్మరణ సభను సోమవారం నిర్వహించారు. వెంకురెడ్డి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెల్లూరు వర్ధమాన సమాజం కార్యదర్శి మజ్జిగ ప్రభాకరరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ వెంకురెడ్డి ఐదు దశాబ్దాలకుపైగా సాహితీ సేవలు అందించడమే కాకుండా మూడు తరాలకు సాహితీవారధిగానూ నిలిచారని కొనియాడారు. టౌన్‌హాల్, వర్ధమా న సమాజానికి అధ్యక్షులుగా నిస్వార్థంగా సేవలు అందించారని స్మరించుకున్నారు. ఆయన సేవలను గుర్తించి కేంద్రం పద్మ అవార్డును అందజేయాలని కోరారు. అనంతరం పలువురు వెంకురెడ్డి జీవితవిశేషాలు, రచనలు, వాటి విశిష్టత, శైలిని వివరించారు. వీఆర్ కళాశాల విశ్రాంత ప్రధానాచార్యులు, పద్యకవి మెట్టు రామచంద్రప్రసాద్ మాట్లాడుతూ తెలుగుభాషకు ప్రత్యేకమైన అవధానాలను పలువురు ప్రముఖులతో నెల్లూరులో ప్రారంభించిన ఘనత వెంకురెడ్డికే దక్కుతుందన్నారు. ప్రముఖ కవి, పండితులు ఆలూరు శిరోమణిశర్మ మాట్లాడుతూ వెంకురెడ్డి రాసిన షాణ్మాతుర స్తవం (శతకం)మహాకవి తిక్కన పద్యాలను స్ఫురణకు తెస్తాయన్నారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పొన్నాల రామసుబ్బారెడ్డి, లతీఫ్‌కుట్టి, చిరసాని కోటిరెడ్డి, చలంచర్ల భాస్కరరెడ్డి, బత్తిన సాయికుమార్‌రెడ్డి తదితరులు వెంకురెడ్డి సాహితీ, సామాజిక సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వెంకురెడ్డికి సింహపురి సాహిత్య భీష్ముడిగా బిరుదును ప్రదానం చేస్తున్నట్లు దువ్వూరు రామిరెడ్డి విజ్ఞాన సమితి ట్రస్ట్ కార్యదర్శి బీ సురేంద్రనాథ్‌రెడ్డి సభికుల ఆమోదంతో హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. నగరంలోని ఒక పార్కుకు అగస్త్యరెడ్డి వెంకురెడ్డి పేరుపెట్టాలని తీర్మానం చేశారు. అగస్త్యరెడ్డి వెంకురెడ్డి కుటుంబసభ్యులు, సాహితీ ప్రముఖులు పాల్గొన్నారు.